RNI No. : TELTEL/2019/79009

కొమురం భీమ్ విలేకరులు కావలెను
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజక వర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత
యువ జర్నలిస్టులకు అవకాశం
రిపోర్టర్‌కు ఇ.ఎస్.ఐ. భద్రత ఉంటుంది
కొమురం భీమ్ Komuram Bheem తెలుగు డైలీ
సంప్రదించగలరు : 85220 24855

తెలుగు దినపత్రిక
# కొమురం భీమ్
ప్రజా సమస్యలపై అక్షర పోరాటం

ఎడిటర్ : ముల్కల్ల ప్రసాద్

సంపుటి : 7 | సంచిక : 140 | 25 జూన్ 2026 | SIMULTANEOUSLY PUBLISHED PEDDAPALLI AND HYDERABAD | గురువారం | పేజీలు : 8 | వెల : 4

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం
- పార్టీకోసం పనిచేయని వారిని వదులుకుంటాం
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- జూమ్ మీటింగ్‌లో సిఎం రేవంత్ ఘాటు హెచ్చరిక

**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):** ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా



సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. >> మిగతా..5లో

## తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై సిఎం రేవంత్ సమీక్ష

- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు
- సమీక్షలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):** జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఇటీవల కర్నాటక వివిధ ప్రాజెక్టును కడుతున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తుంగభద్ర జలాల్లో మన వాటా విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ క్రమంలో సిఎం దీనిపై సమీక్షించారు.




మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. తుంగభద్ర పైన నీటిపారుదల >> మిగతా..5లో

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

- కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి
- ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి
- నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది
- కర్నాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**



తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి >> మిగతా..2లో



### తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం బోనాల పండుగ

- గతంలో ఒకే కార్పోరేషన్ పరిధిలో ఆషాఢ బోనాలు
- ఈ యేడు మూడు కార్పోరేషన్ల పరిధిలో నిర్వహణ
- అన్ని శాఖలు సమన్వయంతో బోనాలను విజయవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాల కల్పనతో పటిష్ట చర్యలు చేపట్టాలి
- ఆషాఢమాస బోనాల సమన్వయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ
- బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయింపు



### రాజకీయాల్లో మహిళా వివక్ష

- ఆడవాళ్లు రాజకీయల్లోకి వస్తే టార్గెట్
- ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష

## ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు

- బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే
- ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల

**ఖమ్మం, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్



నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో >> మిగతా..2లో

## తెలంగాణలో విస్తరించిన నైరుతి

- వారంపాటు జోరు వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**



నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తెలంగాణ అంతటా విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఈ వారం రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. నారు వేసుకోవడం ఆలస్యం అవుతోందని అన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది కాస్త మందకొడిగా సాగిన పవనాలు.. జూన్ 8న రాష్ట్రాన్ని తాకినప్పటికీ, తెలంగాణను పూర్తిగా కమ్మేయడానికి దాదాపు 15 రోజుల సమయం తీసుకున్నాయి. ఈ ప్రభావంతో సోమవారం నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం కూనారంలో ఏకంగా 17.1 సెం.మీల వాన పడింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం విశేషం. హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురవగా.. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో వానలు దంచికొట్టాయి. వీటితో పాటు సంగారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం పగటిపూట కూడా వర్షాలు ఊపందుకున్నాయి. రాబోయే బుధ, గురు, శుక్రవారాల్లో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 24న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వానలు జోరుగా సాగనున్నాయి. ఆ మరుసటి రోజు >> మిగతా..2లో

## రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

- కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం
- జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం
- సత్తుపల్లి పర్యటనలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**ఖమ్మం, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**



రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ >> మిగతా..2లో

కొమురం భీమ్
Komurambheem Telugu Daily



## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

(మొదటి పేజీ తరువాత)

నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి, చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణ పేట, కొడంగల్ కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారు. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసారు. 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుంటున్నది. ఇంత ద్రోహం జరుగుతుంటే మీరు, మీ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం తెలంగాణా ప్రయోజనాలకు ద్రోహం తలపెట్టడం కాదా అని లేఖలో పేర్కొన్నారు. తమ జల హక్కులను కాపాడుకోవడానికి మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి తీసుకురావద్దని హెచ్చరిస్తున్నాం. స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రతి నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పాలమూరు రైతాంగం భవిష్యత్తు కోసం, తెలంగాణ జల హక్కులను కాపాడటం కోసం బీఆర్ఎస్ నిర్విరామ పోరాటం చేస్తుంది. ఎంత దూరం దాకా అయినా వెళ్లి కొట్లాడుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

## తెలంగాణలో విస్తరించిన నైరుతి

(మొదటి పేజీ తరువాత)

(25వ తేదీన) ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. 26వ తేదీన ఈ ప్రాంతాలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడతాయని అధికారులు స్పష్టం చేశారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

### ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

**నల్లగొండ, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**



శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురంలో బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుండి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపుగా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ వేద రక్షిత, ఆలయ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఈఓ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్ పాల్గొన్నారు.

# రైతుబంధు విషయంలో మరోసారి దగా

- కుసుమ్ పథకంలో వేయికోట్ల మోసం
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి





**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**

రైతుబంధు విషయంలో మరోసారి మోసం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారంపై విరుచుకుపడ్డారు. వానా కాలం రైతుబంధు వేస్తామని కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. యాసంగి మీ తాత ఇస్తాడా? అంటూ చురకలు అంటించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన రైతు బంధును సక్కగా ఇచ్చినా కూడా రూ.30 వేల కోట్లు ఇంకా తెలంగాణ రైతులకి బాకీ ఉన్నావని విమర్శించారు. తెలంగాణ రైతులు రేవంత్ రెడ్డి మోసాలను గమనించాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న సర్ కార్యక్రమం ముగిసిన తరువాత ఎన్నికలకు వెళ్లనున్న దృష్ట్యా వానాకాలం రైతు బంధు వేస్తామని నాటకాలాడుతున్నారని, వానాకాలం, యాసంగి కాలం ఇవ్వాల్సిన బాకీని ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బ్యాంకును కూడా బ్లాక్ మెయిల్ చేసే మొనగాడని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలనపై, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలపై ఆయన పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలను పక్కనబెట్టేసిందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు లేవని విమర్శిస్తూ.. ముఖ్యంగా 'కుసుమ్' పథకంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. ఈ స్కామ్‌లో కొందరు పెద్దల పేర్లు వినపడుతున్నాయని, దీనిపై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తక్షణమే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై స్పందిస్తూ.. పీసీసీ చీఫ్ పదవికి ఎసరు పెడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. మెట్రో ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనంటూ చేస్తున్న ప్రచారాన్ని జగదీష్ రెడ్డి తిప్పికొట్టారు. నిజానికి మెట్రో విషయంలో బీజేపీ , 'హైబ్రిడ్ కాంగ్రెస్' ఒక్కటయ్యాయనే విషయం స్పష్టంగా తేలిపోయిందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీతో జట్టు కట్టారని విమర్శించారు. చంద్రబాబు, మోదీ ఆలోచనల నుండి పుట్టిన ఒక క్రాస్ బ్రీడ్, హైబ్రిడ్ సీఎం ప్రస్తుతం రాష్ట్ర పాలన సాగిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ, జాతీయ బ్యాంకులను భయపెడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయబట్టే.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా ఇతర కేంద్ర మంత్రులతో రేవంత్‌కు సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారని అన్నారు. దీన్ని బట్టి చూస్తే కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి పీఏ లాగా పని చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలకు ప్రభుత్వం ఎందుకు అంతలా భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణలో పార్టీ ఆఫీస్ ఏర్పాటు చేయడంపై జగదీష్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణలోనే కాదు, దేశంలో ఎక్కడైనా తమ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఇందులో కొత్తగా ఆఫీస్ పెట్టడం ఏముందని, ఆయన ఎప్పటి నుంచో ఇక్కడే ఉన్నారు కదా అని గుర్తుచేశారు. గతంలో తెలంగాణ వచ్చినందుకు నిరసనగా 11 రోజులు అన్నం తినకుండా పవన్ కళ్యాణ్ చేసిన దీక్ష కూడా తెలంగాణలోనే జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడి తిండితోనే వాళ్ల శరీరం నిర్మాణం అయిందని వ్యాఖ్యానించారు. చివరగా.. పవన్ కళ్యాణ్, మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. వీరందరూ ఒకే కూటమిగా, ఒక్కటిగానే పనిచేస్తున్నారని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం బోనాల పండుగ

- గతంలో ఒకే కార్పోరేషన్ పరిధిలో ఆషాఢ బోనాలు
- ఈ యేడు మూడు కార్పోరేషన్ల పరిధిలో నిర్వహణ
- అన్ని శాఖలు సమన్వయంతో బోనాలను విజయవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాల కల్పనతో పటిష్ట చర్యలు చేపట్టాలి
- ఆషాఢమాస బోనాల సమన్వయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ
- బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయింపు



**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**

తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ గారు బుధవారం జూమ్ వేదికగా ఎంసిఆర్ హెచ్ఆర్ డిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, దానం నాగేందర్, డిజిపి సి.వి. ఆనంద్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్, ఆర్/బీ, వాటర్ వర్క్స్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, ఆర్టీసీ, మెట్రో, పర్యాటక, సమాచార పౌరసంబంధాల శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టే గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయంలో జూలై 16న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13 వరకు అట్టహాసంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తాను లండన్ పర్యటనలో వున్నందున ఇక్కడి నుంచే జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు సూచనలివ్వాల్సి వస్తున్నదని అన్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొ÷-టటెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రభుత్వం నిష్టతో కార్యాచరణను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. గత కొన్నేళ్లుగా బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం గణనీయంగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ నిధులను ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, భక్తులకు సౌకర్యాల కల్పన, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాల ఏర్పాట్లకు సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, రోడ్లు-భవనాల శాఖ, వాటర్ వర్క్స్, ఆర్టీసీ, రైల్వే, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, పర్యాటక శాఖ, సమాచార పౌరసంబంధాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతల కోసం లాక్టేషన్ రూమ్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ద్వారా బోనాల ఉత్సవాలు జరిగే ప్రాంతాలకు రాష్ట్రం నలుమూలల నుంచి తాకిడి వుండే పరిస్థితుల నేపథ్యంలో ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు దేవాదాయశాఖ పై, దేవాలయాల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధతో కోట్లాది రూపాయల నిధులు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు.

సబ్ ఎడిటర్స్ కావలెను
సెల్ : 8522024855

## రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

(మొదటి పేజీ తరువాత)

రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి అని కేటీఆర్ అన్నారు. ఒకటి రెండు కాదు దాదాపు 10వేల కోట్ల రూపాయలతో ప్రారంభమైంది సీతారామ ప్రాజెక్టు. అందులో 8 వేల కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వమే ఖర్చు పెట్టింది. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌పోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు

(మొదటి పేజీ తరువాత)

రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



కొమురం భీమ్
25 జూన్ 2026 (గురువారం)

## సంపాదకీయం

# అయోధ్య రామయ్యా..ఏమిటీ అపచారం !

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరిస్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడు తున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవం

- కిటికీ నుంచి శిశువు బయటరకు విసిరివేత
- యువతని నీలోఫర్‌కు తరలించిన సిబ్బంది

**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :** గోల్కొండ ప్రాంతంలో ఉన్న ఓ విద్యార్థినుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ప్రసవం తీవ్ర కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి బాత్‌రూంలో ప్రసవించగా, అనంతరం నవజాత శిశువు మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, హాస్టల్‌లో నివసిస్తున్న యువతి అకస్మాత్తుగా బాత్‌రూంలో ప్రసవించింది. అనంతరం శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. శిశువు వెంటిలేటర్ ప్రాంతం నుంచి కింద పడేయడంతో మరణించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే శిశువు మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఘటనలో మరో ముఖ్యమైన అంశం యువతి గర్భవతి అనే విషయం హాస్టల్ సిబ్బందికి తెలియకపోవడం. హాస్టల్‌లోనే ఉంటున్న విద్యార్థిని గర్భవతి అయినప్పటికీ ఎవరూ గుర్తించలేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. దీనిపై కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. యువతిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. మరోవైపు, శిశువు మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఘటనతో హాస్టల్‌లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. యువతి గర్భానికి, శిశువు మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా యువతి బావ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# డ్రగ్స్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

- ఒలంపిక్ రన్ ప్రారంభించిన మెదక్ ఎంపి రఘునందన్ రావు



**సిద్దిపేట, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :** డ్రగ్స్ నిషేధానికి ప్రతి జూన్ 23వ తేదీన ఒలింపిక్ డేను నిర్వహిస్తున్నామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. నశా ముక్త భారత్ కింద మళ్లీ ఈ ర్యాలీ చేపడుతున్నామని పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో డిగ్రీ కళాశాల మైదానంలో ఒలింపిక్ రన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ రన్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ఎండలో ఉంచడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. డీ విటమిన్ కోసం ఒక ట్యాబ్‌లెట్ వేస్తున్నారు కానీ ఎండలో మాత్రం ఉంచట్లేదని తెలిపారు. యోగాతో ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులకు యోగా నేర్పించాలని సూచించారు. ఒలింపిక్స్ క్రీడలను తాము చిన్నపుడు చూసేదని.. ఇండియాకి ఎన్ని కప్పులు వచ్చాయో అని తెలుసుకునే వాళ్లమని అన్నారు. ఎప్పుడు కూడా చైనా ఒలింపిక్స్‌లో మొదటగా వచ్చేదని.. మనం మాత్రం కింది స్థానంలో ఉండే వాళ్లమని వెల్లడించారు. నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత క్రీడలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలు అలవాటు చేయాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా మన దేశానికి కావాల్సింది భగవద్గీత పుస్తకాలు కాదని.. క్రీడా మైదానాలు కావాలని అన్నారు. మన దేశంలో ఉన్నా క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటకు ఇంత పెద్ద గ్రౌండ్ ఉండటం చాలా అదృష్టమని.. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

# త్వరలో బీసీ రక్షణ చట్టం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ బీసీల ఆత్మగౌరవం, రక్షణ, సామాజిక న్యాయం కోసం "బీసీ రక్షణ చట్టం-2026" చట్టం తీసుకొస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పారు. కూటమి ప్రభుత్వం గడచిన రెండేళ్లలో శాఖాపరంగా చేపట్టిన ప్రగతిని సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇటువంటి చట్టం తీసుకురావడం దేశంలోనే మొట్టమొదటిసారన్న మంత్రి ఈ చట్టంతో 138 బీసీ కులాలకు రక్షణ లభిస్తుందని అన్నారు. ఇప్పటికే బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధమైనట్లు పేర్కొన్నారు. బీసీ రక్షణ చట్టం కోసం బీసీ మంత్రులు ఇప్పటికే మూడు పర్యాయాలు సమావేశమయ్యారని, బీసీ రక్షణ చట్టం అసెంబ్లీలో ఆమోదం పొందగానే, కేంద్రానికి పంపించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కర్నూలు, ఏలూరు, నెల్లూరులో బీసీ భవనాలను మంజూరు చేశాం.ఒక్కో బీసీ భవనాన్ని రూ. రూ.7 కోట్లతో నిర్మిస్తున్నట్లు మంత్రి సవిత చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా రూ.10 కోట్లతో 48 బీసీ కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 2 ఏళ్లలో 117.68 లక్షల మంది బీసీ లబ్దిదారులకు రూ.32,533.68 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 2024-26 మధ్య 29,16,610 లక్షల బీసీ లబ్ధిదారులకు రూ.25,021.88 కోట్లు, దీపం -2 కింద 54,10,116 లక్షలకు బీసీ లబ్ధిదారులకు రూ.1,864.77 కోట్లు, ఫీజు రియింబర్స్ మెంట్ కింద 2025-26లో 1,17,034 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.911.51 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున 30,38,564 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.3950.13 కోట్లు, ఆటో డ్రైవర్ సేవలో పథకంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున 1,61,538 మంది ఆటో డ్రైవర్లకు రూ.242.31 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులుగా రూ.0.72 కోట్లను 558 మంది బీసీ విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. సామాజిక వర్గీయులకు కేంద్ర ప్రభుత్వ సూచనతో సీఎం చంద్రబాబు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. వాటిలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఆ రిజర్వేషన్లను జగన్ రద్దు చేశారని గుర్తు చేసారు. 2014-19లో కాపు సామాజికవర్గ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో 13 కాపు భవనాలు, 487 మినీ కాపు భవనాల నిర్మాణానికి సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తరవాత వచ్చి జగన్ ప్రభుత్వంలో 13 జిల్లా స్థాయి కాపు భవనాల్లో 9 కాపు భవనాలను రద్దు చేశారని అన్నారు. 487 మినీ కాపు భవనాలకు గాను 421 మినీ కాపు భవనాలు రద్దు చేశారని చెప్పారు. ప్రస్తుతం 40 కాపు భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. వాటి నిర్మాణల పూర్తిచేయడానికి రూ.30 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నా బీసీలు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో వెనుబడిన కులాలను ఉక్కుపాదంతో అణిచివేశారని మంత్రి సవిత అన్నారు. బీసీలు టీడీపీ పక్షమేనని జగన్ భావన అని అందుకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని అణగదొక్కడం ప్రారంభించారని పేర్కొన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని, బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకుండా, స్వయం ఉపాధి రుణాలు నిలిపేశారని, ఆదరణ పథకాలను రద్దు చేశారని గుర్తు చేసారు. పల్నాడు జిల్లాలో తోట చంద్రయ్య, బాపట్లలో అమర్నాథ్ గౌడ్ వంటి పలువురు బీసీలను దారుణంగా హత్య చేయడమే కాకుండా, బీసీలపై అక్రమ కేసులు బనాయించారని, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రతో పాటు తనపైనా, సామాన్య బీసీ కార్యకర్తలపైనా అక్రమ కేసులు బనాయించారని మంత్రి సవిత పేర్కొన్నారు.




## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):** మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ ఎగువన కొలువైన శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. పానకాల స్వామి వారికి పట్టువస్త్రాలతోపాటు పానకం నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన శ్రీ పవన్ కళ్యాణ్ కి ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాద్యాలతో స్వాగతం పలికారు.

# రాజకీయాల్లో మహిళా వివక్ష

- ఆడవాళ్లు రాజీకీయల్లోకి వస్తే టార్గెట్
- ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష




**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :** రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష కొనసాగుతోంది. అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన వేట విమెన్ ఎంపవర్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ వచ్చాక పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చుకున్నా.. ఇప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. జీన్-జెడ్ జనరేషన్‌లోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు ఎదగాలని చూస్తే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో ఎంత సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల మళ్లీ కెరీర్‌ను మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందని, అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం సపోర్ట్ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలపై కవిత షాకింగ్ గణాంకాలను బయటపెట్టారు. 2026 లో కూడా తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని.. పె÷-లళ్లైన 15-19 ఏళ్ల మధ్యలోనే అమ్మలవుతున్న టీనేజర్ మదర్స్ గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే, హైదరాబాద్ లాంటి మహానగరంలోనే 2.7 శాతం మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు పిలుపునిస్తూ.. సోషల్ మీడియాలో లైకులు, ఫాలోవర్స్ రాలేదని నిరుత్సాహపడొద్దని, మహిళలంతా ఒక మంచి టాగ్గెట్ పెట్టుకొని, దాన్ని సాధించే దిశగా బలమైన గొంతుకతో ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు.



# బాల్క సుమన్‌కు హై కోర్టులో ఊరట

### షరతులతో కూడా బెయిల్ మంజూరు

**హైదరాబాద్, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :** సింగరేణి సంస్థ మరియు దాని యాజమాన్యంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. గతంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమన్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం బాల్క సుమన్‌కు రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు, ఇద్దరి పూచీకత్తు సమర్పించాలనే నిబంధనపై బెయిల్ లభించింది. వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్ట్ భయం లేకుండా ఈ బెయిల్ నిర్ణయం ఆయనకు పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని ఈ సందర్భంగా స్పష్టం చేయడం జరిగింది.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily
జిల్లాల వార్తలు

# సాయికృష్ణ అదృశ్యం కేసులో సిబిఐ విచారణ

**హైకోర్టులో పిల్ దాఖలు...సిట్ దర్యాప్తుపై ప్రభుత్వ వివరణ**

**విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు**

**అమరావతి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ కేసు ఆంధ్రప్రదేశ్ రాజకీయ, పోలీస్ వర్గాల్లో సంచలనంగా మారింది. దర్యాప్తులో అసలు న ఇజాలు వెలికి రావడం లేదు. అసలు సాయికృష్ణ ఏమయ్యాడనే దానికి సమాధానం దొరకడం లేదు. ఈ కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థకి అప్పగించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోర్టుకు దర్యాప్తు పురోగతిని వివరించారు. ఈ కేసు సమగ్ర దర్యాప్తు కోసం ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏజీ ధర్మాసనానికి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు పారదర్శకంగా, సక్రమంగా సాగేందుకు ప్రభుత్వం అన్నిరకాల కఠిన చర్యలు తీసుకుందని ఏజీ వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సీఐ నాగరాజును ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని, బుధవారం ఆయనను కోర్టు ముందు హాజరుపరుస్తామని ఏజీ హైకోర్టుకు స్పష్టం చేశారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు విన్న న్యాయస్థానం.. సిట్ దర్యాప్తు ఎలా సాగుతుందో, నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో, ఏం చేస్తారో వేచి చూద్దామని వ్యాఖ్యానించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను జులై 6వ తేదీకి వాయిదా వేసింది. సిట్ విచారణలో సీఐ నాగరాజు నోరు విప్పని నేపథ్యంలో, ఆయన అరెస్ట్ కావడం, కోర్టు ముందు హాజరు పరుస్తుండటంతో ఈ కేసులో మరిన్ని సంచలన నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.



# గట్టు లక్ష్మీనరసింహస్వామి సేవలో జగన్

**ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ సిఎం**

**పులివెందుల, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పులివెందుల పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్.. వేముల మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. జగన్.. గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకోగానే అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. కలశ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే, ఆలయంలో స్వామివారికి నిర్వహిస్తున్న సుదర్శన హోమంలోనూ పాల్గొన్నారు. ఆలయ కార్యక్రమం అనంతరం సమీపంలోని బండలాగుడు మైదానానికి చేరుకుని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించనున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఓబుళరెడ్డి శ్రీరామిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.



# చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ

- **సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు**
- **పోలీసుల తీరుకు నిరసనగా వచ్చేనెల 29న పాదయాత్ర**
- **మీడియా సమావేశంలో అంబటి రాంబాబు**

**గుంటూరు, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
ఏపీలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు. ఏ తప్పు చేయకపోయినా తనను అరెస్ట్ చేశారంటూ మండిపడ్డారు. 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉంచారు. వచ్చే నెల 29న వినతి పాదయాత్ర చేస్తా అని అంబటి ప్రకటించారు. అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ..'కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒత్తిడితోనే నాపై కేసులు నమోదు చేశారు. నా ఇంటిపై దాడి చేయడమే కాకుండా నాపై అక్రమంగా రెండు కేసులు పెట్టారు. నన్ను జైలులో ఉంచారు. రెండు కేసుల్లో ఏడేళ్ళ లోపు శిక్ష పడే సెక్షన్లే పెట్టారు. ఈ కేసులో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐకి హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద నోటీసులు ఇచ్చింది. వంశీధర్ అనే సీఐ, మధు అనే ఎస్ఐ ఇల్లీగల్‌గా నన్ను లోపలేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఈ ముగ్గురు పోలీసులను కేంద్ర మంత్రి పెమ్మసాని పురిగొల్పి నన్ను అరెస్ట్ చేయించారు.

# సాయికృష్ణది కస్టోడియల్ డెత్

- **డెడ్‌బాడీని మాయం చేసేశారు**
- **వారెంట్ ఉన్నా కోర్టులో హాజరు పర్చలేదు**
- **సస్పెండయిన సిఐ నాగరాజ్ కనుసన్నల్లోనే హత్య**
- **సాయికృష్ణ కేసులో కోర్టుకు సిట్ రిమాండ్ రిపోర్ట్**



**విజయవాడ, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసు మిస్టరీకి అధికారికంగా తెరపడింది. ఈ కేసులో అరెస్టయిన సీఐ నాగరాజును రిమాండ్ రిపోర్ట్‌తో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాయికృష్ణది సాధారణ మిస్సింగ్ కేసు కాదని, అది కస్టడీయల్ డెత్ కేసుగా పేర్కొంటూ దర్యాప్తు బృందం కోర్టుకు నివేదిక సమర్పించింది. బుధవారం విజయవాడ 2వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు నిందితుడు సీఐ నాగరాజును హాజరుపరిచిన సిట్ అధికారులు.. దర్యాప్తులో వెలుగుచూసిన పలు కీలక అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సాయికృష్ణది కస్టోడియల్ డెత్ అని, అతడి డెడ్‌బాడీని మాయం చేశారని సిట్ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. రిమాండ్ రిపోర్టులో సిట్ కీలక విషయాలను వెల్లడించింది. నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నా కోర్టులో హాజరుపర్చలేదని సిట్ వెల్లడించింది. గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వాస్పత్రిలో సీఐ నాగరాజుకు వైద్య పరీక్షలు పూర్తికావడంతో 2వ ఏజేఎస్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సిట్.. రిమాండ్ రిపోర్టును సమర్పించింది. సాయికృష్ణను నాన్ బెయిలబుల్ వారెంట్‌లో తీసుకువచ్చి మాయం చేశారు. మే 5 నుంచి జూన్ 19 మధ్య కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టాం. 17 మంది సాక్షులను విచారణ చేశాం. ఫోరెన్సిక్ బృందం సాయంతో సీసీ కెమెరా ఫీడు స్వాధీనం చేసుకున్నాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో హిమజ అనే స్టేషన్ సిబ్బందిని విచారించాం. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో సీసీఫుటేజీ డేటా సిస్టమ్‌లో లేదు. సాయికృష్ణ మృతదేహాన్ని పోలీస్ స్టేషన్‌లోనే చూసినట్లు ఎస్ఐ వాంగ్మూలం ఇచ్చారు. మే5 నుంచి మే8 మధ్య సాయికృష్ణని కృష్ణలంక పీఎస్‌లో చూసినట్టు ఎస్ఐ వాగ్మూలం ఇచ్చారు' అని రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. సాక్షాలను నాశనం చేయడానికి , పోలీసు కస్టడీలో లేకుండా పోవడానికి సీఐ నాగరాజే కారణం. సీసీఫుటేజ్ డేటా 1-5-26 నుంచి 1-6-26 వరుకు డీవీఆర్‌లో లేకుండా చేశారు. ఫోరెన్సిక్ బృందానికి పరీక్ష కోసం డీవీఆర్‌లను పంపించాం. సాయికృష్ణ మరణించాడని తెలిసినా కూడా కృష్ణలంక పోలీస్ సిబ్బంది ఆ సమాచారం మెజిస్ట్రేట్‌కు చేరవేయలేదు. సాయికృష్ణ మరణించాడని అతని తల్లి స్టేషన్‌కు వెళితే సీఐ నాగరాజు దూషించాడు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి హెబియస్ కార్పస్ వేసినా కోర్ట్ ముందు వాస్తవాలను వెల్లడించలేదు. హైకోర్ట్ ముందు నిజాలు దాచారు , కోర్ట్‌ను తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలన్నీ గమనించాక సైంటిఫిక్ ఎవిడెన్స్ చెరిపివేయడం ద్వారా సాయికృష్ణను హత్య చేశాడని గుర్తించాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో ఆధారాలు పూర్తిగా ధ్వంసం చేశారు. అన్ని అంశాలు తెలుసుకోవాలంటే నిందుతుడైన నాగరాజును విచారించాల్సి ఉంది. జూన్ 2 కంటే ముందే సాయికృష్ణ మరణించాడని మేము విశ్వసిస్తున్నాం. కస్టడీలో ఉండగా గాయాలపాలై మరణించాడని అన్ని ఆధారాలు స్పష్టంగా చెబుతున్నాయి' అంటూ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ వెల్లడించింది. చివరకు సాయికృష్ణను కస్టోడియల్ డెత్ చేశారని సిట్ నిర్ధారించింది. సిట్ తరఫున వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది ప్రకారం.. గత నెల 8న మార్కాపురంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాదె సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడిపై నాన్-బెయిలబుల్ వారెంట్ ఉన్నప్పటికీ, చట్ట ప్రకారం కోర్టులో హాజరుపరచలేదని తెలిపారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని పేర్కొన్నారు. దర్యాప్తులో సాయికృష్ణ పోలీసుల అదుపులో ఉండగానే మృతి చెందినట్లు ఆధారాలు లభించాయని సిట్ కోర్టుకు వెల్లడించినట్లు తెలుస్తోంది. అంతేకాక, మరణం అనంతరం అతడి మృతదేహాన్ని కూడా మాయం చేసినట్లు అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కేసు తీవ్రత మరింత పెరిగింది. అయితే సాయికృష్ణ మృతదేహాన్ని మాయం చేశారన్న ఆరోపణలకు ఆధారాలేమిటని న్యాయమూర్తి ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి స్పందించిన దర్యాప్తు వర్గాలు.. కేసుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను ఉద్దేశపూర్వకంగా తొలగించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, తన కుమారుడు కనిపించడం లేదంటూ సాయికృష్ణ తల్లి ఇప్పటికే హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ, సిట్ దర్యాప్తు, తాజాగా కోర్టులో వెల్లడైన అంశాలు కేసును మరింత కీలక దశకు తీసుకెళ్లాయి. నాగరాజు రిమాండ్ రిపోర్టులో నమోదైన అంశాలు, సిట్ కోర్టుకు సమర్పించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం

- **జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టుకు శ్రీకారం**
- **ప్రైవేట్ రంగంలో బంగారం గనుల తవ్వకం ప్రారంభం**
- **తొలి ఏడాదిలో 400 కిలలో బంగారం ఉత్పత్తి లక్ష్యం**
- **సుమారు 700మందికి ఉద్యోగావకాశాలు**
- **రాయలసీమ అభివృద్ధికి కీలకమని ప్రకటించిన చంద్రబాబు**



**కర్నూలు, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు. జొన్నగిరి ప్రాజెక్టుకు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దక్కన్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ సంస్థలు ఇప్పటి వరకు రూ.405 కోట్లు వెచ్చించాయి. ప్రయోగాత్మకంగా చేసిన ఉత్పత్తి పక్రియ విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా బంగారం ఉత్పత్తి చేసే వక్రియను సీఎం ప్రారంభించారు. ప్రైవేటు రంగంలో బంగారం గనుల తవ్వకం, ఉత్పత్తి చేసే పక్రియ ప్రారంభం కావడం దేశంలోనే ఇది మొట్టమొదటిసారి. ప్రపంచంలో బంగారం గనులు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఒకటిగా జొన్నగిరికి అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది. ఏటా రెండు టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసేలా జియోమైసూర్ సంస్థ ప్రణాళికలు రచించింది. ఇక్కడ 700 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఉత్పత్తి చేసిన బంగారం విలువపై నాలుగుశాతం రాయల్టీ లభించనుంది. తొలి ఏడాది 400 కేజీల బంగారాన్ని ఉత్పత్తి చేయనున్న నేపథ్యంలో సుమారు రూ.57 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కర్నూల్ జిల్లాలో ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ఏపీ ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించడంలో అత్యంత కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మైనింగ్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏపీలో పారిశ్రామిక వృద్ధికి, మైనింగ్ రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక కొత్త దిక్సూచిగా మారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనుంది. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడులు, ఉత్పత్తి లక్ష్యాలు, ప్రత్యేకతల వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఏడాదికి 400 కేజీల బంగారు ఉత్పత్తితో మైనింగ్ ప్రారంభం కానుంది. తదుపరి కాలంలో దీనిని ఏడాదికి 900 కేజీలకు పెంచుతారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలోకి వచ్చాక ఏడాదికి ఏకంగా 2 టన్నుల బంగారం ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో వాడే అత్యంత భారీ వాహనాలను సురక్షితంగా నడిపేందుకు వీలుగా 'సిమ్యులేటర్ యంత్రాల' సహాయంతో స్థానిక మహిళలకు, యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా సందర్శించి, అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు జెండా ఊపి ఖనిజంతో కూడిన మట్టిని తరలించే భారీ వాహనాలను ప్రారంభించారు.

**వైకాపా హయాంలోనే పోలవరం**

# కట్టల మట్టి లూటీ

**విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపణలు**

**విజయవాడ, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**
వైకాపా హయాంలోనే పోలవరం కట్టల మట్టి లూటీ జరిగిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపించారు. అప్పటి అక్రమాలకు సంబంధించిన ఫొటోలను చూపిస్తూ.. కట్టు కథనాలతో సాక్షిపత్రిక అడ్డంగా దొరికిపోయిందని విమర్శించారు. పోలవరం కుడికాలువ కింద 2కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని దోచేశారని, దీనిపై 2022లోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేసు కూడా నమోదైందని అన్నారు. కానీ, ఇప్పుడేదో జరిగిపోయిందని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫేక్ నాయకులు, ఫేక్ పార్టీ చేసే ఫేక్ ప్రచారంతో అడ్డంగా దొరికిపోయారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు వాస్తవాలను చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం కుడి కాలువ కింద 2 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి దోచేశారనటానికి తన దగ్గర ఆధారాలు ఉన్నాయన్న కేశినేని చిన్ని.. దమ్ముంటే సీబీఐ, ఈడీ విచారణకు వైకాపా నేతలు సిద్ధపడాలని సవాల్ చేశారు.

**విలేకరులు కావలెను**

ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో రిపోర్టర్లు కావలెను

సెల్: 8522024855

# సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం.

- **దుష్ప్రచారాన్ని నమ్మవద్దు : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**అమరావతి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
సాయిబాబా ఆలయాల విషయంలో తాను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. ముందుగా ఒక



విషయం చాలా స్పష్టంగా చెబుతున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుని మనోభావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను అన్నారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా తమకు లేదని అన్నారు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5వేల భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు.








## మైన్స్ సేఫ్టీ అధికారుల పరిశీలన

**గోదావరిఖని, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**

ఆర్జీ–1 ఏరియా పరిధిలోని జీడీకే–2 ఇంక్లైన్ భూగర్భ గనిలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డిడిఎంఎస్) అధికారులు సాధారణ పరిశీలన నిర్వహించారు. సెకండ్ షిఫ్ట్ రిలే–బిలో జరిగిన ఈ పరిశీలనలో గనిలో అమలు చేస్తున్న రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు, మరియు సాంకేతిక నిర్వహణ విధానాలను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సాగేష్ కుమార్, డిప్యూటి డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ దీపక్ కుమార్ ప్రభాకర్, డిప్యూటి డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ మెకానికల్ కౌశిక్ సేన్‌గుప్తా గనిలోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు. జీడీకే సిఎం (నెం.2,2ఎ, 5) అండర్‌గ్రౌండ్ సెక్షన్‌లోని జిడికె 2ఎ ఇంక్లయిన్ వద్ద జనరల్ ఇన్స్పెక్షన్ నిర్వహించడంతో పాటు, మైన్ ప్లాన్లు, మైన్ డిస్ట్రిక్ట్ ప్లాన్లు, సర్ఫేస్ మాన్ రైడింగ్ స్టేషన్, మరియు అండర్‌గ్రౌండ్ ఎస్ఎస్ 14/2 ప్యానల్‌ను సవివరంగా పరిశీలించారు. ఈ పరిశీలన సందర్భంగా గనిలో అమలు చేస్తున్న భద్రతా చర్యలపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు, భవిష్యత్తులో మరింత మెరుగైన భద్రతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, మల్లారపు మల్లయ్య, ఏజెంట్ డి. రమేష్, గ్రూప్ ఇంజనీర్ పి. రమేష్, మేనేజర్ (స్టాట్యుటరీ) డి. రమేష్ బాబు, మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.కె. అల్లావుద్దీన్, సేఫ్టీ ఆఫీసర్ దొంత వెంకటేశ్వర్లు, పిట్ ఇంజనీర్ కే. మల్లేశం, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్. హరీష్, దొంత వెంకటేశ్వర్లు రావుల దామోదర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ (మైనింగ్) పి. రవి పాల్గొన్నారు.




## ఓక్లే స్కూల్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**

గంగా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ాాూఖూజ్ ాాఎష్ట్రశీశ్రీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారమని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణతో పాటు ఆధునిక విద్యను అందించాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే జీవితంలో విజయాలను సాధించగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక పాల్గొన్నారు



## పోలీస్ సిబ్బందికి రెయిన్‌కోట్లు అందజేసిన పోలీస్ కమిషనర్

**గోదావరిఖని, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**

రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్షాకాలంలో విధి నిర్వహణకు ఉపయోగపడే రెయిన్‌కోట్లను బుధవారం పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్‌కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విధి నిర్వహణ సమయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, మల్లేశం, రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలపై కఠిన చర్యలు

■ **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**

ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలు, భూ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముత్తారం మండలంలోని పోతారం, మైదంబండ గ్రామాల్లో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలపై సమగ్ర విచారణ నిర్వహించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత అధికారుల నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించగా పోతారం గ్రామంలోని సర్వే నెం.59లో 19 ఎకరాలు 01 గుంటల భూమి, మైదంబండ గ్రామంలోని సర్వే నెం.113లో 11 ఎకరాలు 02 గుంటల భూమి ప్రభుత్వ భూములుగా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులు



సదరు భూములను ఎప్పుడూ సాగు చేయలేదని, భూములు వారి భౌతిక స్వాధీనంలో కూడా లేవని విచారణలో తేలిన నేపథ్యంలో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలను రద్దు చేసినట్లు తెలిపారు. తదనుగుణంగా సంబంధిత భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకుని నోషనల్ ఖాతాలో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పూర్తి చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై, ప్రభుత్వ భూములపై అక్రమ హక్కులు పొందేందుకు సహకరించిన మిషన్ భగీరథ మంథని సబ్ డివిజన్ హెల్పర్ గుజ్జుల శ్రీధర్ , మంథని ముత్తారం ఎంపిడిఓ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ పాదాల సతీష్, ముత్తారం నరేగా ఫీల్డ్ అసిస్టెంట్ ధూమల శ్రవణ్ వారిపై, అలాగే ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## గోదావరిఖని టూ కాకినాడ నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**

ప్రజల రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపర్చే దిశగా గోదావరిఖని నుండి కాకినాడకు నూతన ఆర్టీసీ బస్సు సేవను బుధవారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. బస్సుకు పూజలు నిర్వహించి, జెండా ఊపి ఆయన సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ గోదావరిఖని, పరిసర ప్రాంతాల ప్రజలకు కాకినాడకు ప్రయాణించేందుకు ఈ కొత్త బస్సు సేవ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని రవాణా సౌకర్యాల




కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. కొత్త బస్సు సేవ ప్రారంభం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణకు ఎస్సీ లా పట్టభద్రుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

■ **జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్**

**పెద్దపల్లి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**

అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడు సంవత్సరాల శిక్షణ పొందుటకు గాను 2026–27 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హత కలిగిన లా పట్టభద్రుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులు జూన్ 20, 2026 నుండి జూలై 31, 2026 వరకు ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడు సంవత్సరాల శిక్షణకు ఎంపికైన లా పట్టభద్రులకు నెలకు రూ.3,000




స్టైఫండ్‌తో పాటు పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.50,000 ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థుల వార్షిక కుటుంబ ఆదాయం రూ.2 లక్షలకు మించరాదని, షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై ఉండాలని, లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, లా గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూన్ 20, 2026 నుండి ప్రారంభమై జూలై 31, 2026తో ముగుస్తుందని, అభ్యర్థుల ఎంపిక ఆగస్టు 10, 2026న నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, గది నెం.232, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం పెద్దపల్లి కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వ్యాధుల నియంత్రణ, నివారణపై శిక్షణా కార్యక్రమం

**పెద్దపల్లి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన పెద్దపల్లి జిల్లాలోని అన్ని సూపర్వైజర్లకు కీటక జనిత వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యలపై జిల్లా స్థాయి సమావేశం శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలు మరియు పట్టణ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, జ్వరాల పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పిహెచ్‌సి స్థాయిలో చేపట్టవలసిన జ్వరాల పర్యవేక్షణ, లార్వా సర్వేలు, యాంటీ లార్వల్ చర్యలు, కేసుల నివేదికలు, హాట్‌స్పాట్ ప్రాంతాల గుర్తింపు, డ్రై డే కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సూపర్వైజర్లకు శిక్షణ అందించబడింది. అలాగే గ్రామ స్థాయిలో ాాచీవీం మరియు ాాూనూా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి నిల్వ నీటిని తొలగించడం, దోమల నివారణపై అవగాహన కల్పించడం, లార్వా ఉన్న ప్రాంతాలను గుర్తించి నిర్మూలించడం వంటి చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం



(చీజఎదీణజ) జిల్లా అధికారి డా. శ్రీరాములు గారు పాల్గొని, కీటక జనిత వ్యాధుల నియంత్రణకు సంబంధించి ఫీల్డ్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, సర్వైలెన్స్, లార్వా నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని, ఈ నెల 28వ తేదీ ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం గురించి వివరించారు. జిల్లాలోని 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా సూపర్వైజర్లు, ాాచీవీం, ాాూనూా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత ముఖ్యమైనదని, ఇంటింటి సందర్శనల ద్వారా అర్హులైన పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, కార్యక్రమ నిర్వహణ అధికారులు, జిల్లాలోని అన్ని ఆరోగ్య సంస్థల సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై సిఎం రేవంత్ సమీక్ష

(మొదటి పేజీ తరువాత)

శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న ఆందోళన నెలకొంది. రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఉంది. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయి. తుంగభద్ర జలాలను కర్ణాటక ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరచింది. అయినప్పటికీ ఆ నిబంధనలు ఖాతరు చేయకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుందన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరం ఉందని గ్రహించిన సిఎం వీటిపై ఆరా తీసారు. దీంతో మంత్రులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఇదిలావుంటే తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు మాజీమంత్రి హరీష్ రావు సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాత)

పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily




## 99 రోజుల కార్యక్రమం విజయాలను
# ఆకర్షణీయమైన పుస్తకంగా రూపొందించాలి

- ప్రతి శాఖ లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణపై నివేదిక సిద్ధం చేయాలి
- ప్రజల వినతులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ అంశాలను డాక్యుమెంట్ చేయాలి
- జిల్లా విజయగాథలు, వినూత్న కార్యక్రమాలు ప్రత్యేకంగా నమోదు చేయాలి
- ఇతర జిల్లాలు అనుసరించదగిన ఉత్తమ విధానాలను పుస్తకంలో పొందుపరచాలి
- గ్రామాల్లో తాగునీరు, అంగన్‌వాడీ భవనాలు, రహదారుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి
- 99 రోజుల కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్

**పెద్దపల్లి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను ఆకర్షణీయమైన పుస్తకంగా రూపొందించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పెద్దపల్లి జిల్లాలో 99 రోజుల కార్యక్రమం అమలుపై రెవెన్యూ శాఖ కార్యదర్శి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీ, అదనపు కలెక్టర్( రెవిన్యూ) కొప్పుల వెంకట్ రెడ్డి లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ వివిధ శాఖలు చేపట్టిన కార్యక్రమాలను వివరించగా, అనంతరం శాఖల వారీగా అధికారులు తమ పురోగతి నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా లిరెవెన్యూ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, జిల్లా స్థాయిలో కార్యక్రమాల పురోగతిని పరిశీలించేందుకు జిల్లా ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో అమలైన కార్యక్రమాలు, విజయాలు, వినూత్న చర్యలు, ఇతర జిల్లాలు అనుసరించదగిన ఉత్తమ



విధానాలను పొందుపరుస్తూ ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించాలని సూచించారు. ప్రతి శాఖ 99 రోజుల కార్యక్రమంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, పెండింగ్ అంశాలు, చేపట్టిన పనులు, ప్రస్తుత స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సంక్షిప్త నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా నమోదు చేయాలని సూచించారు. శాఖలు చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, ప్రత్యేక ప్రచారాలు, ప్రజలకు ఉపయోగపడిన చర్యలను ప్రత్యేకంగా హైలైట్ చేయాలని తెలిపారు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తలు, ఎలక్ట్రానిక్ మీడియా కథనాలు, వార్తా క్లిప్పింగ్స్‌ను కూడా భద్రపరచాలని సూచించారు.జిల్లా స్థాయి పుస్తకం సంక్షిప్తంగా, ఆకర్షణీయంగా ఉండాలని, ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారాలను అందులో పొందుపరచాలని తెలిపారు. ఇతర జిల్లాలు అనుసరించగలిగే కార్యక్రమాలను ప్రత్యేకంగా హైలైట్ చేయాలని సూచించారు. 99 రోజుల కార్యక్రమం ద్వారా పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి సమస్యలు, వృద్ధాప్య పింఛన్లు, గ్రామీణ రహదారులు, మరమ్మతుల వంటి అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయని, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూలి మార్చి 2026 నుండి జూన్ 12 వరకు జిల్లాలో 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. విద్యాశాఖలో సీఎచ్‌ఎం స్కూల్ విజిట్స్‌లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈ విధానాన్ని ఇతర జిల్లాలు అనుసరించాలని సూచించినట్లు తెలిపారు. విద్యార్థుల ఇంగ్లీష్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, తెలుగులో ఐదో ర్యాంకు, గణితంలో ఐదో ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. 340 సమ్మర్ క్యాంపుల ద్వారా 3,500 మంది విద్యార్థులు లబ్ధి పొందారని తెలిపారు. పోషణ రంగంలో తీవ్రమైన పోషకాహార లోపం (శాూవీ) శాతాన్ని 15.6 నుంచి 0.74 శాతానికి తగ్గించామని, అంగన్‌వాడీ పిల్లల్లో స్టంటింగ్ శాతాన్ని 27.5 నుంచి 20.55 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. 706 అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రపరచడంతో పాటు 678 మంది అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశామని, 24,779 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందించామని తెలిపారు. 706 కేంద్రాల్లో గ్యాస్ స్టౌలు, 200 మరుగుదొడ్లు, 50 తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాసంగి-2026లో 62,602 మంది రైతుల నుంచి 4,46,066 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1,057 కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-1 కాలువల డీసిల్టింగ్‌తో చివరి ఆయకట్టు వరకు నీరు అందించినట్లు పేర్కొన్నారు.డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా 40,300 నీటి కనెక్షన్లను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. ఎస్సీ సంక్షేమ శాఖ విద్యార్థిని శార్వ్య రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు వెల్లడించారు. జిల్లాలో 263 గ్రామ సభలు నిర్వహించగా, 1,225 ప్రభుత్వ సంస్థలు, 850 కిలోమీటర్ల రహదారులు, 385 కిలోమీటర్ల డ్రైన్లను శుభ్రపరిచినట్లు తెలిపారు. 60 ఆహార భద్రత తనిఖీలు నిర్వహించి 9 కేసులు నమోదు చేసినట్లు, అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. అలైవ్-అరైవ్ కార్యక్రమంలో భాగంగా 359 అవగాహన కార్యక్రమాలు, 45 యాంటీ డ్రగ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. బాల్య వివాహాల నివారణపై 610 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వెల్ఫేర్ వీక్ సందర్భంగా మైనారిటీ శాఖ ద్వారా 300 కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉల్లాస్ పథకం కింద 59,941 మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దగా, 32,912 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 573 కొత్త స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9,233 స్వయం సహాయక సంఘాలకు రూ.493.15 కోట్ల బ్యాంకు లింకేజీ అందించామని, మహిళా సాధికారతలో భాగంగా 16 బస్సులను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందజేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ బస్సుల ద్వారా మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు. 29,471 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు, మహాలక్ష్మి పథకం కింద 1,18,953 కుటుంబాలకు రూ.500కే 4,73,691 గ్యాస్ సిలిండర్లు అందించినట్లు తెలిపారు. నాబార్డ్ ద్వారా 1,500 మెట్రిక్ టన్నుల గిడ్డంగి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. మే 6న నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 79 కంపెనీలు పాల్గొనగా, 3,515 మంది యువత హాజరై 933 మంది ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. రూ.523.31 కోట్ల పెట్టుబడులు జిల్లాకు ఆకర్షించి 438 ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మే 18 నుంచి 23 వరకు 255 మంది విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించినట్లు తెలిపారు. 21 ఐఎంఎస్ భవనాలకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీ మాట్లాడుతూలి ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని డ్రైన్లను శుభ్రపరిచినట్లు, నీటి కనెక్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు, పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేసినట్లు వివరించారు. వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టడం ద్వారా రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

---

## ఆయిల్‌పామ్ తోటలు నాటుకోండి నెల నెలా జీతం లాగా ఆదాయం పొందండి

**పెద్దపల్లి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**



రైతులు సాంప్రదాయ పంటలతో పాటు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా చేపట్టాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఆయిల్‌పామ్ ఒక వాణిజ్య పంటగా రైతులకు దీర్ఘకాలం పాటు నెల నెలా జీతం మాదిరిగా ఆదాయాన్ని అందించే విశిష్టత కలిగి ఉందని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటలు నాటిన తర్వాత సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. అనంతరం ప్రతి నెలా తాజా పండ్ల గుత్తులు కోతకు రావడంతో రైతులకు నిరంతర ఆదాయం లభిస్తుంది. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల ప్రభావం తక్కువగా ఉండటంతో పాటు ప్రభుత్వం మరియు ఆయిల్‌పామ్ కంపెనీల సహకారంతో పంటకు భరోసా లభిస్తుందని వివరించారు. ఇటీవల నిర్వహించిన ఆయిల్‌పామ్ శిక్షణ కార్యక్రమాల్లో రైతులకు మొక్కల నాటకం, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, పురుగులు మరియు వ్యాధుల నివారణ, కోత అనంతర నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే కూరగాయల సాగు, పంటల వైవిధ్యీకరణ (జతీశీజూ ణఱఙవతీంఱటఱష్ఠఱశీఅ) ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై కూడా రైతులకు సూచనలు అందించారు. రైతులు ఆయిల్‌పామ్ సాగును స్వీకరించి దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి తెలిపారు

---



## యువతకు, వారి తల్లిదండ్రులకు మాదకద్రవ్యాల నిషేధం పై అవగాహన సదస్సు

**అంతర్గాం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి**

**పెద్దపల్లి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మురుమూరు గ్రామంలో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అంతర్గాం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి ముర్ ముర్ గ్రామంలో స్థానిక యువతకు, వారి తల్లిదండ్రులకు (అంటి డ్రగ్స్) మాదకద్రవ్యాల నిషేధం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకట స్వామి మాట్లాడుతూ ముఖ్యంగా యువత గంజాయి మత్తు కు అలవాటు పడి తన విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.గంజాయి మత్తుకు అలవాటు పడిన యువకులు చెడు స్నేహాలు చేస్తూ తన ఆరోగ్యాన్ని నాశనం చేసుకొని తన విలువైన భవిష్యత్తును అంధకారంచేసుకుంటున్నారు. గంజాయి మత్తుకు అలవాటు పడిన యువకులు అమ్మాయిలను ఏడిపించడం, డబ్బు కోసం ఇంట్లో తల్లిదండ్రులతో గొడవలు పెట్టుకోవడం, దొంగతనాలకు పాల్పడడం, అసాంఘిక కార్యకలాపాలు చేయడం వంటివి చేస్తున్నారు.రోడ్డుపై యువత మత్తులో వాహనాన్ని వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎవరైనా గంజాయి (మాదకద్రవ్యాలు) అమ్మిన, కొన్న, మదకద్రవ్యాలను రవాణా చేసిన వారిపై మాదకద్రవ్యాల చట్టం ప్రకారం పోలీస్ కేసులు నమోదు చేయబడతాయి. కావున తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులని, మీ పిల్లల భవిష్యత్తు మీ చేతిలో నే ఉందని తల్లిదండ్రులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప- శ్రీనివాస్, అంతర్గాం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి, కార్యదర్శి ఎస్ కమల, పోలీస్ సిబ్బంది ఏం సంతోష్, నాగరాజ్,స్థానిక యువత, గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక అద్యాపకుల, ఉపాధ్యాయుల భర్తీ

**పెద్దపల్లి, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**
పెద్దపల్లి జిల్లాలో గల 06 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల్లో పాఠశాల స్థాయిలో మరియు ఇంటర్మీడియెట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో బోధన చేసేందుకు తాత్కాలిక బోధన సిబ్బంది ఎంపిక కొరకై అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నది. పెద్దపల్లి జిల్లాలో ఉన్న 05 సైన్స్ కళాశాలలు మరియు 01 ఆర్ట్స్ కళాశాలలో అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు, తాత్కాలిక పద్ధతిన జూనియర్ లెక్చరర్/పి జి టి/టీ జి టి/స్పెషల్ టీచర్లు.. అభ్యర్థుల ఎంపిక కొరకు, తేదీ: 29.06.2026 తేదిన సోమవారం నాడు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల / కళాశాల బాలికలు గర్రెపల్లి లో నేరుగా దరఖాస్తులు స్వీకరించబడి, ఉదయం 09:00 గంటల నుండి 11.00 గంటల వరకు దృవ పత్రాల పరిశీలన నిర్వహించబడునని.. తరువాత వెంటనే "తరగతి బోధన - పరిశీలన (ఐజుమీూ)" నిర్వహించబడునని, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, పెద్దపల్లి జిల్లా సమన్వయ అధికారి ఊటూరి శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ మరియు పిజిటి పోస్టులకు యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం 50% మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పి.జి. డిగ్రీ తో పాటు బి.ఇడి. అర్హత మరియు టిజిటి పోస్టుకు యు జి సి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బిఎస్సీ, బిఏ, బికామ్ డిగ్రీ కనీసం 50% మార్కులతో పాటు, బి.ఇడి అర్హత కలిగి ఉండాలి. ఆర్ట్ టీచర్ పోస్టుకు దీఖీూ/ఐజఐ అర్హత మరియు మ్యూజిక్ టీచర్ పోస్టుకు ఏదైనా డిగ్రీ మరియు క్లాసికల్ మ్యూజిక్ లో డిప్లొమా కలిగి ఉండవలెను. రెసిడెన్షియల్ విద్యా బోధన పట్ల అవగాహన మరియు ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా నిర్దేశించబడిన తేదీలో, తమ పూర్తి బయోడేటా తో పాటు, దృవ పత్రాల పరిశీలనకొరకు, తమ విద్యార్హతలను తెలిపే ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకొని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల వద్దకు సకాలంలో హాజరు కావలసి ఉంటుంది.

---

## సజ్జలబోడులో ముగిసిన "రుద్రారణ్య" చిత్ర షూటింగ్

**గుండాల, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల మండలం సజ్జలబోడు గ్రామంలో ప్రముఖ యువ దర్శకుడు దుష్యంత్ దీకొండ దర్శకత్వంలో తెరకెక్కుతున్న "రుద్రారణ్య" చిత్ర షూటింగ్ ముగిసింది. ఇప్పటికే గ్రామీణ ప్రేమకథా చిత్రంగా ప్రేక్షకుల ప్రశంసలు పొందిన "సజ్జలబోడు ప్రేమకథ" చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు దుష్యంత్ దీకొండ, ఈసారి పూర్తి భిన్నమైన కథాంశంతో రుద్రారణ్య" చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అరణ్య ప్రాంతాల నేపథ్యంలో సాగే ఈ చిత్రం ప్రేమ, భావోద్వేగాలు, మానవ సంబంధాలు, ప్రకృతి పరిరక్షణ, సామాజిక సందేశాల సమ్మేళనంగా రూపొందుతోంది. ఈ చిత్రంలో ప్రముఖ నటులు జలాల్ మహమ్మద్, ఈసం ముసుపతి రావు, భవాని, సీతారాములు, షారోజ్, గారెల సుందరమ్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్ర ఛాయాగ్రహణ బాధ్యతలను ప్రకాశ్ వజ్జా నిర్వహిస్తున్నారు, గుండాల మండలంలోని ప్రకృతి సోయగాలు, అరణ్య



ప్రాంతాలు, గిరిజన సంస్కృతి మరియు స్థానిక జీవన విధానాన్ని సహజత్వంతో వెండితెరపై ఆవిష్కరించేందుకు చిత్ర బృందం కృషి చేస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు దుష్యంత్ దీకొండ మాట్లాడుతూ, మన భద్రాద్రి జిల్లాలోని అద్భుతమైన ప్రకృతి అందాలను, అరణ్య జీవనాన్ని, మనుషుల మధ్య ఉన్న భావోద్వేగ బంధాలను ప్రేక్షకులకు చేరవేయాలనే ఉద్దేశంతో 'రుద్రారణ్య' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. స్థానిక కళాకారులకు అవకాశం కల్పిస్తూ, మన ప్రాంత ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం మా ప్రధాన లక్ష్యం. ప్రేక్షకులు తప్పకుండా ఈ చిత్రాన్ని ఆదరిస్తారని నమ్ముతున్నాం అని తెలిపారు,చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ, గుండాల మండలం మరియు పరిసర ప్రాంతాల్లోని అందమైన లొకేషన్లలో చిత్రికరించారు, త్వరలోనే మరిన్ని విశేషాలను వెల్లడిస్తామని తెలిపారు.

---

## మృతుల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**రామగుండం, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**
అంతర్గాం మండలం టీటీఎస్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాదకర ఘటన గురించి తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒకే కుటుంబంలో ముగ్గురిని కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం, మనోబలాన్ని భగవంతుడు



ప్రసాదించాలని ఆకాంక్షించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్రం వైఫల్యంపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆగ్రహం

**గోదావరిఖని, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్):**



నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న లోపాలు, విద్యార్థులపై పడుతున్న మానసిక ఒత్తిడి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష రాయలేకపోతున్నాననే ఆవేదనతో ఓ విద్యార్థిని తన తల్లిదండ్రులకు లేఖ రాసి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాదకరమని అన్నారు. విద్యార్థుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో విద్యార్థులను, వారి కుటుంబాలను కలిసి వారికి ధైర్యం చెప్పడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్రాలో వందకోట్ల దుర్వినియోగం

- విచారణలో అన్ని విషయాలు బయటపెడతాం
- రెండేళ్లలో క్రీడల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం
- గామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడలకు ప్రోత్సాహం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి.



**అమరావతి,జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :** ఆడుదాం ఆంధ్రా' అక్రమాలపై విజిలెన్స్ నివేదిక త్వరలోనే బయటకు వస్తుందని క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రూ.100 కోట్లకుపైగా ఇందులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయన్న ఆయన.. తప్పు చేసిన వారు తప్పించుకోలేరన్నారు. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ అమల్లో సూక్ష్మ లోపాలు కూడా లేవని తేల్చి చెప్పారు. క్రీడల కోటాలో 3శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల .. గత రెండేళ్లలో 800 మందికి పైగా ఉద్యోగాలు సాధించారన్నారు. ఖేలో ఇండియా పథకం నిధులు రూ.75 కోట్లతో రాష్ట్రంలో మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రెండేళ్లలో క్రీడలు, యువజన రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడలకు ప్రోత్సాహం అందించాం. సీఎం చంద్రబాబు సారధ్యంలో యువత, క్రీడాకారుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడిందని అన్నారు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో క్రీడాలు యువజన సేవల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత నిస్తూ అనేక కీలక కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. అమరావతి సచివాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన క్రీడా వ్యవస్థను పునరుద్ధరించి, మౌలిక వసతుల కల్పన, క్రీడాకారుల ప్రోత్సాహం, యువత సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. విజయనగరం విజ్జీ స్టేడియం, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పూర్తిచేసి ప్రారంభించామని తెలిపారు. ఖేలో ఇండియా పథకం కింద రూ.75 కోట్లతో విజయవాడ, కుప్పం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, గుంటూరులో ఆధునిక క్రీడా మౌలిక వసతుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.5.60 కోట్ల నగదు ప్రోత్సాహకాలు అందించగా, వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 429 మంది క్రీడాకారులకు రూ.19 కోట్ల ప్రోత్సాహకాలు అందించినట్లు చెప్పారు. క్రీడాకారుల ఉద్యోగ రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడంతో రెండు సంవత్సరాల్లో 819 మంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం చేపట్టామని, ఇప్పటివరకు 46 కేంద్రాలు పూర్తయ్యాయని, మరో 91 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లు, పారా బ్యాడ్మింటన్, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ వంటి పలు జాతీయ స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 31 క్రీడా విభాగాల్లో లీగ్ పోటీలను నిర్వహిస్తున్నామని, విశాఖపట్నం,కాకినాడ, తిరుపతిలో మూతపడిన క్రీడా అకాడమీలను తిరిగి ప్రారంభించి 13 క్రీడా విభాగాల్లో శిక్షణ అందిస్తున్నామని వెల్లడించారు.యువజన సేవల విభాగం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా యువజన ఉత్సవాలు, వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్, వ్యక్తిత్వ వికాసం కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించి లక్షలాది మంది యువతకు ప్రయోజనం చేకూర్చినట్లు మంత్రి వివరించారు. ఆంధ్ర యువ సంకల్ప్ 2025 కార్యక్రమం ద్వారా యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించే వినూత్న ప్రయత్నం చేపట్టామని చెప్పారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళల భద్రత వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా 593 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 2,820 యువజన క్లబ్‌లను ఏర్పాటు చేసి యువతలో నాయకత్వ లక్షణాలు, స్వచ్ఛంద సేవా భావాన్ని పెంపొందించామని వివరించారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య పరీక్షలు, జాతీయ యువజన దినోత్సవం, యువజన ఉత్సవాల ద్వారా యువతను సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేశామని తెలిపారు. క్రీడలు మరియు యువజన అభివృద్ధి ద్వారా రాష్ట్ర యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యువజన సంక్షేమం, క్రీడలు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ ఎండీ భరణి పాల్గొన్నారు. అనంతరం 2026 ఆంధ్రా యువసంకల్ప్ 2ఎ 26 కరపత్రాన్ని విడుదల చేశారు.

# అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

- ఘనంగా స్వాగతించిన స్థానిక నేతలు
- మోపిదేవిలో ప్రత్యేక పూజలు
- కొక్కిలిగడ్డ జడ్పీ పాఠశాల నేతన భవనానికి ప్రారంభం



**మచిలీపట్టణం, జూన్ 24 (కొమురం భీమ్ న్యూస్) :** అవనిగడ్డ నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. కొక్కిలిగడ్డ నుంచి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న మంత్రి.. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకునే ముందు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. 'బాగున్నారా' అంటూ కరచాలనం చేశారు. 'లోకేశ్ అన్నా' అంటూ ప్రేమతో మంత్రిని స్థానిక ప్రజానీకం పలకరించింది.అనంతరం, వేద ఆశీర్వచనాలతో లోకేశ్‌కు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి.. స్వామివారి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ఫొటో, లడ్డూ ప్రసాదాన్ని అందించి లోకేశ్‌ను అధికారులు సత్కరించారు. లోకేశ్ వెంట ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత దర్శించుకున్నారు. అనంతరం మోపిదేవిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. పెదప్రోలులో మంత్రికి మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మోపిదేవి మండలంలో ఆధునీకరించిన కొక్కిలిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో గ్రామస్తులకు మంత్రి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ అశోక్ బాబు పాల్గొన్నారు. లోకేశ్ పర్యటన సందర్భంగా పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ప్రతిఒక్కరికీ అభివాదం చేస్తూ మంత్రి ముందుకు సాగారు.

## కొమురం భీమ్ క్రీడలు

# కోహ్లీని వెనక్కినెట్టిన శుభ్‌మన్ గిల్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాప్ లేపాడు. అఫ్గానిస్థాన్‌తో ఇటీవల ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన గిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకును అందుకున్నాడు. ఈ సిరీస్‌లోని తొలి రెండు వన్డేల్లో శుభ్‌మన్ గిల్ 84, 154 పరుగులతో రాణించిన సంగతి తెలిసిందే. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. శుభ్‌మన్ గిల్ కంటే అతనికి కేవలం 24 రేటింగ్ పాయింట్స్ ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో శుభ్‌మన్ గిల్.. విరాట్ కోహ్లీని వెనక్కినెట్టాడు. తొడకండరాల గాయంతో అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో స్థానానికి పడిపోగా.. రోహిత్ శర్మ నాలుగో స్థానంలోనే కొనసాగుతున్నాడు. టీమిండియా పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ ఏకంగా 21 స్థానాలు దూసుకొచ్చి 43వ ర్యాంకు సాధించగా, శ్రేయస్ అయ్యర్ 14వ స్థానంలో నిలిచాడు. కేఎల్ రాహుల్ రెండు స్థానాలు దిగజారి 11వ స్థానానికి పరిమితమయ్యాడు. బౌలింగ్ విభాగంలోనూ టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు మెరుగుపరుచుకుని 22వ స్థానాన్ని అందుకోగా.. ప్రసిద్ధ్ కృష్ణ ఏకంగా 34 స్థానాలు ఎగబాకి 58వ ర్యాంకును దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో నిలిచాడు. మరోవైపు టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ నెంబర్ 1 బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ అగ్రస్థానం కోల్పోయి రెండో స్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో జో రూట్ 14వేల పరుగుల మైలురాయి అందుకున్న సంగతి తెలిసిందే. సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ ఫీట్ సాధించిన ఏకైక బ్యాటర్‌గా జోరూట్ నిలిచాడు. మరోవైపు టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మ్యాట్ హెన్రీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో 11 వికెట్లతో చెలరేగి కివీస్ 253 పరుగుల భారీ విజయం సాధించడంలో మ్యాట్ హెన్రీ కీలక పాత్ర పోషించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో హెన్రీ టెస్టుల్లో నంబర్ 1 బౌలర్‌గా అవతరించాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు. కివీస్ క్రికెట్ చరిత్రలో జాక్ కౌవీ, రిచర్డ్ హాడ్లీల తర్వాత 36 ఏళ్లకు టెస్టుల్లో నంబర్ వన్ ర్యాంకు సాధించిన మూడో ఫాస్ట్ బౌలర్‌గా 34 ఏళ్ల మ్యాట్ హెన్రీ రికార్డు సాధించాడు.

# ఇన్‌స్టాలో పంత్ ఆసక్తికర పోస్ట్..!

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి అధికారికంగా స్వాప్ అయిన తర్వాత రిషభ్ పంత్ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ తనకు వీడ్కోలు పలుకుతూ పెట్టిన పోస్ట్‌ను షేర్ చేస్తూ.. 'థాంక్యూ టీమ్' అని రాసుకొచ్చాడు. రూ. 27 కోట్ల రికార్డు ధరతో లక్నోలో చేరిన పంత్.. కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలం కావడంతో జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగుకు పడిపోయింది. ఈ క్రమంలోనే కుల్‌దీప్ యాదవ్‌తో ట్రేడ్ ద్వారా పంత్ రూ. 12 కోట్ల జీతాన్ని తగ్గించుకుని మళ్లీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డు క్రియేట్ చేసిన రిషభ్ పంత్.. రెండేళ్ల తర్వాత లక్నో సూపర్ జెయింట్స్‌ను వీడాడు. ఐపీఎల్ 2025 వేలంలో లక్నో.. రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్లకు దక్కించుకుంది. కెప్టెన్‌ను చేసింది. అయితే ఆటగాడిగా, కెప్టెన్‌గా దారుణంగా విఫలమయ్యాడు. దీంతో లక్నో సూపర్ జెయింట్స్.. పంత్‌ను వదిలేసింది. స్వాప్ డీల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి కుల్‌దీప్ యాదవ్‌ను తెచ్చుకుని.. రిషభ్‌ను ఇచ్చేసింది. అయితే ఇది జరిగిన తర్వాత ఈ వికెట్ కీపర్ ఆసక్తికర పోస్టు పెట్టాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌తో ట్రేడ్ తర్వాత.. అతడు సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ వీడ్కోలు పోస్ట్‌ను షేర్ చేస్తూ.. 'థాంక్యూ టీమ్' అని రాసుకొచ్చాడు. దీంతో పంత్‌కు, లక్నో సూపర్ జెయింట్స్‌కు మధ్య బంధం తెరపడినట్లయింది. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు లక్నోలో చేరిన అతడు.. ఐపీఎల్ 2026 పూర్తయిన కొన్ని రోజులకే



ఆ ఫ్రాంఛైజీని వీడాడు. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున పంత్.. ఆశించిన మేర రాణించలేకపోయాడు. ఎన్నో అంచనాలతో కొత్త ఫ్రాంఛైజీలో చేరిన అతడు.. అంచనాలను అందుకోలేదు. ఐపీఎల్ 2025లో లక్నో.. ఆరు విజయాలు, ఎనిమిది ఓటములతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. తర్వాతి సీజన్ మరింత కష్టంగా మారింది. పంత్ నాయకత్వంలోని జట్టు 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగు విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానానికి పరిమితమైంది. ఐపీఎల్ 2025లో పంత్ 14 మ్యాచ్‌లలో 269 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2026లో 312 పరుగులు చేశాడు. ఇందులో ఒకే అర్ధశతకం ఉంది. ఇక తాజా ట్రేడ్ ద్వారా పంత్ జీతంలో భారీ కోత పడింది. అతడు తన ఐపీఎల్ జీతంలో ఏకంగా రూ. 12 కోట్లు తగ్గించుకున్నాడు. రూ. 15 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరిపోయాడు. 2016 నుంచి 2024 మధ్య ఎనిమిది సీజన్ల పాటు తాను ఆడిన ఫ్రాంఛైజీతో అతడు మళ్లీ జతకట్టాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వెళ్లే ముందు పంత్ ఢిల్లీ తరఫున 111 మ్యాచ్‌లు ఆడాడు. అలాగే 2021 నుంచి 2024 వరకు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, 43 మ్యాచ్‌లలో జట్టును నడిపించాడు.

# టీజీ20 లీగ్‌లో తొలి సెంచరీ బాదిన అమన్ రావు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'టీజీ20 లీగ్ 2026' టోర్నీలో సరికొత్త రికార్డు నమోదైంది. టోర్నమెంట్‌లో మొట్టమొదటి సెంచరీ నమోదై ప్రేక్షకులను అలరించింది. మెదక్ ఫాల్కన్స్‌తో జరుగుతున్న లీగ్ మ్యాచ్‌లో వరంగల్ వారియర్స్ ఓపెనర్, కెప్టెన్ అమన్ రావు పేరాల సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపిస్తూ మైదానంలో విధ్వంసం సృష్టించాడు. కేవలం 32 బంతుల్లోనే అమన్ శతకాన్ని బాదాడు. తద్వారా ఈ సరికొత్త లీగ్ టోర్నీలో సెంచరీ సాధించిన మొట్టమొదటి బ్యాటర్‌గా చరిత్ర పుటల్లోకెక్కాడు.మ్యాచ్ ఆరంభం నుంచే అమన్ రావు భారీ షాట్లతో విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లలోనే రెండు సిక్సర్లు బాదిన అమన్, ఆ తర్వాత కూడా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. ముఖ్యంగా సయ్యద్ ఖాజీ అబ్బాస్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో అమన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఆ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4, 6, 6 బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. ఈ క్రమంలోనే కేవలం 17 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.అర్ధ సెంచరీ తర్వాత కూడా మెదక్ ఫాల్కన్స్ బౌలర్లను అమన్ రావు ఓ ఆట ఆడుకున్నాడు. టీమిండియా స్టార్ ప్లేయర్ తిలక్ వర్మ వేసిన ఏడో ఓవర్లో చివరి మూడు బంతులకు వరుసగా 6, 4, 4 బాదాడు. అనంతరం రవితేజ వేసిన ఎనిమిదో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో



విరుచుకుపడ్డాడు. చివరకు సాయి వరుణ్ బౌలింగ్‌లో (9.4 ఓవర్ వద్ద) ఫోర్ బాదడం ద్వారా అమన్ రావు తన అద్భుతమైన సెంచరీ మార్కును అందుకున్నాడు. అమన్ రావు ఆడిన ఈ మెరుపు ఇన్నింగ్స్ టీజీ20 లీగ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# ఇంగ్లండ్‌తో సిరీస్ కు సూర్యవంశీకి నో ఛాన్స్!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 విజయానంతరం తొలి మ్యాచ్ ఆడేందుకు టీమిండియా సిద్ధమైంది. రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమిండియా శుక్రవారం తొలి మ్యాచ్ ఆడనుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా మంగళవారమే ఐర్లాండ్ ఫ్లైట్ ఎక్కింది. ఈ సిరీస్‌తో టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2027 రోడ్ మ్యాప్ మొదలవ్వనుంది. టీ20 ప్రపంచకప్ 2026 గెలిపించిన సూర్యకుమార్ యాదవ్‌తో పాటు పలువురు ఆటగాళ్లు ఈ సిరీస్‌కు దూరం కాగా.. ఐపీఎల్ స్టార్లకు అవకాశం దక్కింది. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, హార్దిక్ పాండ్యాలకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీతో పాటు సూర్యన్ష్ షెడ్గేలు అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసేందుకు సిద్దమయ్యారు. ముఖ్యంగా 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌తోనే అతను అరంగేట్రం చేస్తాడని అంతా అనుకుంటున్నారు. కానీ టీమిండియా వికెట్ కీపర్ సబా కరీమ్ మాత్రం వైభవ్ సూర్యవంశీ అవసరం ఇప్పుడే టీమిండియాకు లేదని అభిప్రాయపడ్డాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడుతూ..ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడే తుది జట్టును ప్రకటించిన సబా కరీమ్.. వైభవ్ సూర్యవంశీని విస్మరించాడు. ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులుగా ఉన్న అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లనే ఓపెనర్లుగా కొనసాగించాడు. ఇషాన్ కిషన్‌ను నెంబర్ 3లోకి తీసుకున్న సబా కరీమ్.. నాలుగో స్థానంలో నయా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేశాడు. వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఐదో స్థానంలో తీసుకోగా.. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్‌ను ఎంచుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లను పేసర్లుగా ఎంచుకున్న సబా కరీమ్.. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తిని తీసుకున్నాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా శివమ్ దూబేకు అవకాశం కల్పించాడు. వైభవ్ సూర్యవంశీని సబా కరీం విస్మరించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily



# రంగస్థలం తరవాత అంతటి సినిమా పెద్ది

- ఎంతో కష్టపడితే తప్ప ఇంతగా ప్రేక్షకులు ఆదరించరు
- చరణ్ నటనను చూసి పుత్రోత్సాహం ఆస్వాదిస్తున్నా
- దర్శకుడు బుచ్చిబాబును అభినందించిన చిరు




నటుడిగా ఎంతో పరిపక్వత, పరిపూర్ణతని ప్రదర్శిస్తున్న రామ్‌చరణ్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. తండ్రిగా గర్వపడుతున్నానని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో 'పెద్ది' విజయోత్సవం జరిగింది. రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. జాన్వీ కపూర్ కథానాయిక. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. వెంకట సతీశ్ కిలారు నిర్మాత. ఈ వేడుకలో చిత్రబృందం, పంపిణీదారులు, ప్రదర్శనకారులకి జ్ఞాపికలు ప్రదానం చేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ 'పెద్ది తరహా సినిమాలు రావాలి, పరిశ్రమ సుభిక్షంగా ఉండాలి. పెద్ది చూస్తూ భావోద్వేగానికి గురయ్యాను. అలాంటి అనుభూతినిచ్చే సినిమాలు అరుదుగా వస్తుంటాయి. ఆ కథా ప్రపంచంలో లీనమై ఉద్వేగానికి గురయ్యాను. పాత్రలతోపాటు బాధని అనుభవించా. ఇంత శక్తిమంతమైన, భావోద్వేగమైన కథ, పాత్రలకు చరణ్ న్యాయం చేస్తారని నమ్మిన దర్శకుడు బుచ్చిబాబుకు కృతజ్ఞతలు. సుకుమార్ తీసిన 'రంగస్థలం' చూసి రామ్‌చరణ్ ఎంత బాగా చేశాడో అన్నారు. అలాంటి రంగస్థలం రావాలంటే ఎన్నేళ్లు పడుతుందో అనుకున్నాం. పెద్దిలాంటి సినిమా ఇంత తొందరగా వస్తుందని ఊహించలేదు. ఆ విషయంలో చరణ్ చాలా అదృష్టవంతుడు. తను ప్రేక్షకుల్ని అంతగా కట్టిపడేయడానికి కారణం పాత్రని కఠోరంగా నమ్మడమే ప్రతి ఒక్కరికీ ఓ ధ్యేయం ఉండాలి. ఆ లక్ష్యంవైపు వెళ్లేందుకు శారీరకంగా శ్రమించాలి. ఎలా కష్టపడాలో ఈ సినిమాతో రామ్‌చరణ్ నిరూపించాడు. అత్యున్నతమైన నటన అని ప్రేక్షకులు మెచ్చుకున్నారంటే దాన్ని మించిన పురస్కారం మరొకటి ఉండదన్నారు. ఇప్పుడు చిరంజీవికాదు... చరణ్‌జీవి. ప్రధానితో కలిసి ఈమధ్యే పాల్గొన్న ఓ కార్యక్రమంలో చరణ్‌ని న్యూ ఏజ్ మెగాస్టార్ అన్నారు. ఇకపై చరణ్‌ను ముందుంచి నేను వెనుక ఉండటం సరైనది. బిడ్డలు ఎదిగినప్పుడు పొందే ఆనందం అంతా ఇంతా కాదు. 'రంగస్థలం' తర్వాత నేను పొందింది కొంతే, 'పెద్ది' తర్వాత వంద శాతం పుత్రోత్సాహాన్ని ఆస్వాదిస్తున్నానని అన్నారు. 'పెద్ది' సినిమాలోని నటీనటులు, పనిచేసిన సాంకేతిక బృందాన్ని అభినందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ 'తొలి రోజు రామ్‌చరణ్‌కు కథ చెప్పడానికి వెళ్లినప్పుడు 'ఈ పెద్ది పాత్ర అందరూ ఇంటికి తీసుకెళ్లేలా ఉండాలి' అనుకున్నా. రామ్‌చరణ్ తన నటనతో ఆ కథని అందరూ ఇంటికి తీసుకెళ్లేలాగే చేశారు. అందుకు కృతజ్ఞతలు. 'పెద్ది' ద్వితీయార్ధంలో ఆయనలోని నటుడు తప్ప మరొకటి కనిపించదు. ఎంతగా ఊహించుకున్నానో, అంతకు పదిరెట్లు ఎక్కువే చేశారు. అందుకు జీవితాంతం రుణపడి ఉంటాను. సుకుమార్ శిష్యుడు అనిపించుకోవడమే నాకు ఇష్టం' అన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, అనిల్ రావిపూడి, రవిశంకర్ యలమంచిలి, అనంతశ్రీరామ్, రత్నవేలు, ఇషాన్ సక్సేనా, సాహు గారపాటి, గీత రచయిత బాలాజీ, కాస్ట్యూమ్ డిజైనర్ ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'కొన్ని విజయాలు చాలా ఆనందాన్నిస్తాయి. ఈ విజయం నా జీవితాన్ని మార్చేసింది. ఇన్ని సినిమాలకు నాకు వచ్చిన ప్రేమ, అభిమానం వేరు, ఈ సినిమాతో అందరూ చూపించిన అభిమానం వేరు. నా హృదయంలో నిలిచిపోయే విజయాన్నిచ్చారు. రామ్‌చరణ్‌ని మరిచిపోయే పెద్దినే గుర్తు పెట్టుకుంటారేమో అని భయమేస్తోంది. నా ఇంట్లోనే నేనది అనుభవించా. నా కూతురు క్లీంకారా 'పెద్ది' విడుదలయ్యేవరకూ నాన్న నాన్న... అనే పిలిచేది. ఇప్పుడు పెద్ది, పెద్దినాన్న అని పిలుస్తోందని నవ్వుతూ అన్నారు. ఇంత పెద్ద అందమైన జ్ఞాపకాన్ని ఇచ్చిన దర్శకుడు బుచ్చిబాబుకు చాలా కృతజ్ఞతలు. సాంకేతిక బృందం అంతా గొప్పగా పనిచేసిందని అన్నారు.





## చరణ్‌పై మోడీ ప్రశంసలతో పులకించా

### ఎక్స్ వేదికగా చిరంజీవి ఆనందోత్సాహం

మెగాస్టార్ చిరంజీవి తన కుమారుడు రామ్ చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల 'పెద్ది' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకుని టాప్ ట్రెండింగ్‌లో ఉన్న రామ్ చరణ్ రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించారు. దీనిపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సుమతీ శతక పద్యంతో తన పోస్ట్‌ను ప్రారంభించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ'. అని రాస్తూ కొడుకు పుట్టగానే తండ్రికి నిజమైన సంతోషం కలగదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని చూసి జనాలు మెచ్చుకున్నప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమని పేర్కొన్నారు. ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చిరంజీవి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.



## వారణాసి షూటింగ్‌కు మహేశ్‌బాబు బ్రేక్

### మళ్లీ జూలై1 నుంచి పాల్గొంటారని సమాచారం

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు తాజాగా చిన్న విరామం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రీసెంట్‌గా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహేష్ బాబు తన భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి కనిపించారు. ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబంతో కలిసి కనిపించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వారణాసి' షూటింగ్‌కు మహేష్ బాబు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు స్పష్టమైంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, మహేష్ బాబు జూలై 1నుంచి మళ్లీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. వరుసగా నెలల తరబడి షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం కుటుంబంతో కొంత సమయం గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు పాత్రల గురించి వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాలో ఆయన 'రుద్ర' పాత్రలో కనిపించడమే కాకుండా, శ్రీరాముడి పాత్రలో కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్లు, అడ్వెంచర్ సన్నివేశాలు సినిమా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక ఈ చిత్రంలో 'మందాకిని' పాత్రలో కనిపించనుంది. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. ముఖ్యంగా ఈ చిత్రాన్ని పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ స్థాయి విజువల్స్, సాంకేతిక విలువలతో రూపొందుతున్న ఈ సినిమాను పలు భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లో కూడా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.




## శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

## 'గాసిప్' సినిమా చూడాల్సిందే

మనం సరదాగా మాట్లాడే మాటలు ఇతరుల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలియాలంటే మా 'గాసిప్' సినిమా చూడాల్సిందే' అంటున్నారు దర్శకుడు వైభవ్ కౌండిన్య. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ ప్రధాన పాత్ర పోషించగా.. యతి రేమెళ్ల నిర్మించారు. రవివర్మ, మహేశ్ యడ్లపల్లి, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సాయికిరణ్ అడివి ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ.. 'మాటకు చాలా శక్తి ఉంది. ఒక మాట మనిషిని నిలబెట్టగలదు. అదే మాట అతడిని కూల్చగలదు. అందుకే ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యత ఉండాలని సందేశాన్నిచ్చే చిత్రమిది. నా జీవితంలో.. నా మిత్రుల జీవితాల్లో జరిగిన కొన్ని నిజ సంఘటనలు దీంట్లో ఉన్నాయి. ఇదొక మంచి భావోద్వేగభరిత ప్రయాణం. కచ్చితంగా అందర్నీ ఆలోచింపజేస్తుంది' అన్నారు. 'ఇది నాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఒక చిన్న గాసిప్ ఓ వ్యక్తి జీవితాన్ని ఎలా తలకిందులు చేస్తుందో చూపించే కథ. దీన్ని థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నారు నటి రాశీ సింగ్.

## మాట్లాడినా..మాట్లాడకున్నా తప్పే..అవుతోంది

- ధర్మన్ సినిమా లాంచ్‌లో రజనీకాంత్ ఆవేదన




తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి అసహనం వ్యక్తం చేశాడు నటుడు సూపర్ స్టార్ రజనీకాంత్. తాజాగా చెన్నైలో జరిగిన 'ధర్మన్' సినిమా లాంచ్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, బహిరంగంగా మాట్లాడాలంటే ఇప్పుడు భయంగా ఉందని చెప్పారు. తాను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే అవుతోందని రజినీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపైకి మాట్లాడమని పిలిస్తే భయంగా ఉందని, ఎందుకంటే తాను మాట్లాడితే అది తనకు కాకపోయినా మీకు సమస్య అవుతుందని ఆయన అన్నారు. ఒకవేళ మౌనంగా ఉంటే మౌనంగా ఎందుకు ఉన్నాడు అని ఎగతాళి చేస్తారని చెప్పారు. అదే మాట్లాడితే ఇప్పుడు ఎందుకు మాట్లాడాడు, అసలు మాట్లాడకుండా ఉండాల్సింది అని విమర్శిస్తారని తెలిపారు. ఇక చాలా ఏళ్ల తర్వాత తనకు ఒక విషయం అర్థమైందని, మనల్ని ఇష్టపడని వాళ్లకు మనం ఏం చేసినా నచ్చదని, ఇష్టపడేవాళ్లు మనం ఏం చేసినా నచ్చుతుందని అనుకోవడం మూర్ఖత్వమని రజినీ అన్నారు. ప్రతి ఒక్కరూ మనల్ని మెచ్చుకుంటారని ఆశించడం సరికాదని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రజినీకాంత్ 'ధర్మన్' చిత్ర షూటింగ్ గురువారం నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తుండగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించబోతున్నాడు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు సూపర్‌స్టార్ రజినీకాంత్ బహిరంగంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై రజినీకాంత్ స్పందించారు. 'ధర్మన్' లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివాదానికి తెరదించారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత మీడియా అడిగిన ప్రశ్నకు రజినీకాంత్ బదులిస్తూ, తామిద్దరం ఇప్పటికే వ్యక్తిగతంగా మాట్లాడుకున్నామని దీనిపై చర్చలు అవసరం లేదని తెలిపాడు. జూన్ 22న ముఖ్యమంత్రి విజయ్ 52వ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, కమల్ హాసన్, కీర్తి సురేష్, ఖుష్బూ సుందర్, మోహన్‌లాల్, త్రిష సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు బహిరంగంగా శుభాకాంక్షలు తెలిపారు. అయితే విజయ్‌కి రజినీకాంత్ విష్ చేయకపోవడంపై కొందరు ట్రోల్స్ చేయడం మొదలుపెట్టారు. గతంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు కూడా రజినీకాంత్ బహిరంగంగా స్పందించకపోవడంతో ట్రోల్‌కి గురికాగా.. మరోసారి ఆయనను టార్గెట్ చేశారు నెటిజన్లు. అయితే తాజాగా ఈ వివాదానికి ముగింపు పలికాడు రజినీకాంత్.

Printer, Published and Owned by YASHASHWIN PUBLICATIONS, H.No. 21-1-29/A/J/1, GODAVARIKHANI, Dist. Peddapalli, TELANGANA STATE - 505 209.
Printers : Yashashwin Printers, Godavarikhani. Editor : MULKALA PRASAD, RNI No. : TELTEL/2019/79009, e-mail : komurambheemnews@gmail.com, Mobile : 8522024855